క్లుప్తంగా

శబరిమలకు పాదయాత్ర

మరికల్: మండల కేంద్రంలో అయ్యప్ప మాల ధరించిన స్వాములు సోమవారం శబరిమలకు కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా కూసురు రవిస్వామి ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. జ్యోతి దర్శనం వరకు శబరిమలకు చేరుకుంటామని తెలిపారు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్



ధన్వాడ: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన డా.రామ్మోహన్ ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కిషన్, ఉపాధ్యక్షుడిగా తాను ఎన్నికైనట్లు రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ధన్వాడ గ్రామస్తులకు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయినికి డాక్టరేట్



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌కు చెందిన వై.శారద హిందీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. 'ఇందువ శిష్టకే కావ్యమే సంవేదన ఔర్ షిల్ప్' అంశంపై డా. విజయకుమార్ జాదవ్ పర్యవేక్షణలో పరిశోధనలు పూర్తి చేయగా.. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ హిందీ విభాగం నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శివాజీ నగర్ కాలనీ వాసులు ఆమెకు అభినందనలు తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మద్దూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయుడు కె.సూర్యప్రకాష్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో క్రీడా దుస్తులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సవిత, పీడీ వెంకటప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

మద్దూరు: మక్తల్ పట్టణంలో వచ్చేనెల 3, 4 తేదీల్లో సీపీఎం జిల్లా రెండవ మహాసభ నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని పెదిరిపాడ్‌లో మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా మహాసభకు రైతులు, కార్మికులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భరత్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

దామరగిద్ద: మండలంలోని ఆశన్‌పల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘం, గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన పనులు, పంచాయతీ తీర్మానాలు, బడ్జెట్ ఆమోదం, ఓచర్స్, బిల్లుల డ్రాకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేకుండా చేశారని పేర్కొన్నారు.

మున్నూరుకాపుల సమస్యలు పరిష్కరిస్తాం

నర్వ: మున్నూరు కాపుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి హన్మంతురెడ్డి అన్నారు. మున్నూరు కాపుల సంఘం జిల్లా కన్వీనర్ బండి శివరాం రెడ్డి, కోకన్వీనర్ రఘుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతిరెడ్డి హన్మంతురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంజీవారెడ్డి, గౌరవాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రవి, కుర్మారెడ్డి, హన్మంతురెడ్డి, ఆనంద్, సహాయ కార్యదర్శులుగా జనార్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మీడియాసెల్ కన్వీనర్‌గా రైచూర్ శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారుగా వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రాంరెడ్డి, చెన్నారెడ్డి, పల్లె రాంరెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

నర్వ: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలపై వాహన దారులకు అవగాహన కల్పించారు. వాహన దారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● కలెక్టర్ సిక్తా పట్నాయక్



మక్తల్‌లో ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి స్వీట్లు వడ్డిస్తున్న మహిళలు

మక్తల్: మహిళా సంఘాలను అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు.. ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం మక్తల్‌లో ఇందిరమ్మ మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయగా.. కలెక్టర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో మెరుగైన ఉపాధి పొందేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.6.40లక్షలు రుణం తీసుకొని ఇందిరమ్మ క్యాంటిన్‌ఏర్పాటు చేశారని, లాభదాయకంగా నడిపించాలని అన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మక్తల్‌లో ఇందిరమ్మ మహిళా క్యాంటిన్ ఏర్పాటు చేయడం ఎంతో అభినదనీయమని అన్నారు. ఊట్కూర్,నర్వ, మ్దాలాల్లో త్వరలో మహిల క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కోరారు. తక్కువ వడ్డీకి రునాలు అందించి వ్యాపారం చేసుకోవాలని కోరారు. డీఆర్‌డీఏ మొగులప్ప, ఏపీడీ అంజయ్య, కమిషనర్ బోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో లాభాలు..

ఊట్కూరు: పెరటి కోళ్లపెంపకం ద్వారా లాభాలు పొంది ఆర్థికంగా ఎదగవచ్చని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఊట్కూరులో సోమవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సమాఖ్య ఆధ్వర్యంలో రూ. 2 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేసిన పెరటి కోళ్ల పెంపకం మదర్ యూనిట్‌ను కలెక్టర్ సక్తాపట్నాయక్ ప్రారంభించారు. మహిళలు స్వశక్తితో వివిధ వ్యాపారాలు చేసుకొని లాభాలు పొదవచ్చని ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తుందని కలెక్టర్ తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి..

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం యర్నాగన్‌పల్లిలో పదేళ్ల క్రితం మూతపడిన ప్రాథమిక పాఠశాలను సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గుడి, బడి తప్పకుండా ఉండాలన్నారు. యర్నాగన్‌పల్లిలో పాఠశాల మూతపడినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. పేదలు తమ పిల్లలను చదువు నిమిత్తం మక్తల్‌కు పంపించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడటంతో పాఠశాలకు ఇద్దరు టీచర్లను నియమించారని.. పాఠశాల పునఃప్రారంభం రోజునే 10 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం జక్లేర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమాల్లో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఈశ్వర్‌రెడ్డి, ఎంఈఓ అనిల్‌గౌడ్, వెటర్నరీ డాక్టర్ గిరికుమారి, జీహెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌తో విద్యార్థులకు విజ్ఞానం



జిల్లా కేంద్రంలో ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట: ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని పోలీసు అధికారులు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం నారాయణపేట పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాల్గొనగా వారికి పోలీసుల విధులు, పోలీసుల ద్వారా వినియోగించబడుతున్న వివిధ రకాలైన ఆయుధాలు, వాటి మందుగుండు సామగ్రి, ఆయుధాల పనితీరు, వాటి తయారీ, ఆయుధాలను తయారుచేసిన సంస్థ దేశాల పేర్లను విద్యార్థులకు సిఐశివశంకర్, అర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వివరించారు. సాయుధ దళంలో పనిచేసే బాంబుస్క్వాడ్ బృందం వీఐపీల సందర్శన సమయంలో, రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే దారి, కల్వర్టులు, హెలిక్యాప్టర్ నిలుపు ప్రదేశాలు, బాంబులు తనిఖీ చేయడం, వినియోగించే పరికరాలు డీప్ సర్చ్ మెటల్ డిటెక్టర్, నాన్ లీనియర్ జంక్షన్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్, ఓకే డిటెక్టర్ లాంటి వాటి పని విధానాలను వివరించారు. డాగ్ స్క్వాడ్ బృందంచే జాగిలాలు, వాటి పనితనం, చేసే విధులు, నేరస్తులను వాసన పసిగట్టి కనుగొనే విధానాన్ని, పోలీసు జాగిలాల నైపుణ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న వివిధ రకాలైన పద్ధతులను తెలియజేసి తల్లిదండ్రులకు బంధువులకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలు

ప్రతి కళాశాల, పాఠశాలల నందు యాంటీ ర్యాగింగ్ కమిటీలు, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని సిఐ వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలను వినియోగించకుండా వాటి వల్ల జరుగు అనర్థాలు భవిష్యత్తును నాశనం చేసుకునే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు పాల్గొన్నారు.

పోలీసు విధులపై అవగాహన..

ధన్వాడ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల విధులపై ఎస్‌ఐ రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుదర్శన్, వినయ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం..

నర్వ: శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. నర్వ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల విధుల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయుధాల పనితీరును విద్యార్థులు ఆసక్తిగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఆంజనేయులు, శ్రీకాంత్, శంకర్, అనంత్‌రెడ్డి, దేవి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప

దామరగిద్ద: వరిధాన్యం విక్రయించేందుకు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,320, గ్రేడ్-బీ రకాన్ని రూ. 2,300లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి మురారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, శరణప్ప, సదానందం, వెంకట్రామారెడ్డి, రఘు, మాణిక్యప్ప, నర్సప్ప, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి



మాగనూర్‌లో మాట్లాడుతున్న అందె బాబయ్య

కృష్ణా/ఊట్కూరు: బీజేపీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని.. దేశ భవిష్యత్ కోసం ప్రతి పౌరుడు బీజేపీలో చేరాల్సిన అవసరం ఉందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. సోమవారం కృష్ణా, ఊట్కూరు మండల కేంద్రాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఒక్కో పోలింగ్ బూత్‌లో 100 మందితో సభ్యత్వం చేయించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, శ్రీనివాసులు, జయానంద్ రెడ్డి, అశోక్‌గౌడ్, మల్లేష్, నర్సప్ప, హన్మంతు, రమేష్, రఘువీర్, ఆశప్ప పాల్గొన్నారు.

పత్తి రైతులను దోపిడీ చేస్తున్న మిల్లర్లు

నారాయణపేట: జిల్లాలోని పత్తి మిల్లుల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి, పత్తి రైతులను దోపిడీ చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పత్తి మిల్లుల యాజమాన్యం ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందన్నారు. వారు చెప్పిన ధరకు మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తున్నారని.. రైతులు ఒప్పుకోకపోతే తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరడం లేదన్నారు. కేవలం ఒకటి, రెండు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. ఆశించిన మేరకు రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రైవేటు పత్తి వ్యాపారులు తేమ పేరుతో క్వింటాల్‌కు రెండు, మూడు కిలోల పత్తిని ఎక్కువగా తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రైతుల నుంచి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ప్రకటించాలి



దామరగిద్దలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్‌సీని ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మక్తల్, దామరగిద్ద, కోస్గి, గుండుమాల్, కృష్ణా, ధన్వాడ, మరికల్ తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కంటి తుడుపు చర్యగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక్క పీఆర్‌సీతో సరిపెట్టడం తగదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

పంటలన్నింటికీ మద్దతు ధర, బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము

నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని పంటలకు బోనస్ ఇస్తూ.. మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు భగవంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. వరి సన్న రకాలకు మాత్రమే బోనస్ ప్రకటించడం సరికాదని.. మిగతా పంటలు పండించే వారు తెలంగాణ రైతులు కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో వెంటనే పత్తి, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, దళారుల నుంచి రైతులను కాపాడాలన్నారు. అధిక వర్షాలతో పత్తి దిగుబడి సగానికి పడిపోవడంతో రైతులు తీవ్ర నష్టంలో ఉన్నారన్నారు. పత్తి తేమశాతం 10 నుంచి 15 వరకు ఉన్నా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. 12 శాతాని కంటే ఎక్కువ తేమ ఉంటే, ఒక్కో శాతానికి రూ. 75 చొప్పున ధర తగ్గించడం హేయమైన చర్యన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 5వ తేదీ వరకు చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శి కొండ నర్సింహులు, బాలకృష్ణ, నారాయణ, బాబు, ఆనంద్ ఉన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి హల్‌చల్

మద్దూరు: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. ఎస్‌ఐ రాంలాల్ వివరాల మేరకు.. మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన చంద్రయ్యగౌడ్ మద్యం మత్తులో స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో చిరు వ్యాపారులకు చెందిన ఆరు తోపుడు బండ్లను ధ్వంసం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని చంద్రయ్యగౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

మరికల్: మండలంలోని పస్పులకు చెందిన బొక్క ఎల్లప్ప సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన అనిత రవికుమార్‌గౌడ్, భానుప్రసాద్‌గౌడ్ పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కోస్గి: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని క్లస్టర్ జీహెచ్‌ఎం శేఖరయ్య అన్నారు. సోమవారం ముశ్రీఫా ఉర్దూ మీడియం, ముంగిమళ్ల, ముక్తిపాడ్ ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

ధన్వాడ: మండలంలోని మందిపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను గ్రామస్తులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నర్సింహులు, రామకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, జైపాల్, శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కేశవ్ పాల్గొన్నారు.

కౌలు రైతు కుటుంబానికి పరామర్శ

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన కౌలు రైతు టింగినోళ్ల ఆశప్ప ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అప్పులబాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు ఆశప్ప కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. వారి వెంట బీకేఎస్ నాయకులు ఆశప్ప, బాలప్ప, వెంకటప్ప, విశ్వనాథ్‌రెడ్డి, బాపనపల్లి రాము, నర్సింహులు, పెంటప్ప యాదవ్, స్వచ్ఛంద సంస్థ కార్యకర్త శ్యాములు తదితరులు ఉన్నారు.

జిల్లా నలుమూలల చెక్‌పోస్టులు

నారాయణపేట: వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లలో పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వరి ధాన్యం రాకపోకలను నిలువరించేందుకు జిల్లా పరిధిలో 6 బోర్డర్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. నారాయణపేట మండలంలోని జలాల్పూర్, దామరగిద్ద మండలంలో కాన్కుర్తి, కృష్ణ మండలంలో చేగుంట, కృష్ణ బ్రిడ్జి, ఊట్కూర్ మండలంలో సమస్తాపూర్, మాగనూర్ మండలంలో ఉజ్జెల్లి చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ చెక్‌పోస్టులలో పోలీస్ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులు ఉండి పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వరి ధాన్యం రాకుండా చూడాలని, వాహనాల వే బిల్లులను తనిఖీ చేయాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేకుంటే చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెక్‌పోస్టు దగ్గర వచ్చి పోయే ప్రతి ఒక వాహనాల నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వ్యాపారస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, చెక్‌పోస్టుల వద్దనే కాకుండా బోర్డర్ గ్రామాల నుంచి జిల్లాలోకి రాకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్లో ఉన్న ఎస్‌హెచ్‌ఓలు నిరంతరం చెక్ పోస్టులపై నిఘా ఉంచాలని చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులను నిరంతరం తనిఖీ చేస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని తెలిపారు.

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని చేగుంట, వాసునగర్ ప్రాంతాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు కృష్ణా ఎస్‌ఐ ఎండీ నవీద్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి వచ్చే ధాన్యం లారీలను తనిఖీ చేయడంతోపాటు వరి ధాన్యాన్ని రాష్ట్రంలోని రానివ్వకుండగా నివారించుటకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బొందల్‌కుంట పేరు కొనసాగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బొదల్‌కుంట గ్రామస్తులు

మక్తల్: మండలంలో నర్సిరెడ్డిపల్లిగా మార్చిన బొందల్‌కుంట పేరును ఎప్పటిలాగే కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామస్తుల అభిప్రాయం తెలుసుకోకుండా బొందల్‌కుంటను నర్సిరెడ్డిపల్లిగా మార్చారని అన్నారు. తమ గ్రామం పూర్వకాలం నుంచి బొందల్‌కుంటగానే కొనసాగుతుందని.. గ్రామస్తుల ఆకాంక్ష మేరకు నర్సిరెడ్డిపల్లి పేరును తొలగించాలని కోరారు. కార్యక్రమంలో గాదం వెంకటేష్, అనంతరెడ్డి, జగదీష్, విశ్వనాథ్, నరేష్, రమేష్, నర్సింహులు, మన్సూర్, కొండ వెంకటయ్య, కాశీం, శ్రీపాద్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలుపర్చాలి..

నారాయణపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు మహమ్మద్‌అలీ, నరహరి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నష్టం కలిగించే 4779 సర్క్యులర్‌ను రద్దు చేయాలని.. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు శేఖర్, కేశవులు, మాణిక్యప్ప, కృష్ణ, దేశ్యాబయక్ , బాలకృష్ణ, బాలప్ప పాల్గొన్నారు

పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి

కోస్గి: పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని.. అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ తిరుపతిరెడ్డి సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు గ్రామలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, రఘువర్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

దామరగిద్ద: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మొగుల్‌మడ్క జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సే నో డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయన్నారు. వాటితో కలిగే అనర్థాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. భావిభారత పౌరులుగా యాంటీ డ్రగ్స్ ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రహరీ క్లబ్ పేరుతో హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులతో కూడిన యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుగౌడ్, ఎన్నికల కమిటీ కన్వీనర్ వెంకట్, కోకన్వీనర్ శేఖర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోయిలకొండ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా హనమంతు, వెంకట్, గురుప్రసాద్, అదనపు కార్యదర్శిగా లింగప్ప, కార్యదర్శిగా అజీజ్ అహమద్ ఖాన్, విఠోభ, అశోక్, మహమ్మద్, కోశాధికారిగా మధుకర్, ప్రచార కార్యదర్శిగా సురేష్, హెల్త్ కన్వీనర్‌గా సంజీవ్ ప్రకాష్, ఎడ్యుకేషన్ కన్వీనర్‌గా రాజేష్, క్రమశిక్షణ కన్వీనర్‌గా శ్రీధర్, లీగల్ సెల్ కన్వీనర్‌గా బాల్‌రాజ్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఆమోదించినట్లు రాష్ట్ర డిజిటల్ మీడియా కార్యవర్గ సభ్యుడు రఘు గణప పేర్కొన్నారు.